ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

సోమవారం 21 జూలై 2025

- చేబదుళ్లు కూడా లేవు..
- మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక కష్టాలు
- వడ్డీ ఆశలతో మోసపోతున్న వ్యాపారులు, చిరుఉద్యోగులు
- అప్పులు తీసుకున్న వారి నుంచే బెదిరింపులు
- మరోవైపు వడ్డీ వ్యాపారులపై పోలీసుల కొరడా
- బ్యాంకుల్లో పెరుగుతున్న డిపాజిట్లు
- గత సంవత్సరం 54 ఫైనాన్స్ కేసులు.. ఈనెలలోనే 10 కేసులు

అప్పు పుట్టట్లే..



వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదా చేస్తున్న పోలీసు అధికారులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

"సిరిసిల్ల చెందిన ఒక వ్యక్తి బిజినెస్‌లో పెట్టుబడుల ఆశలు చూపి అధిక వడ్డీ ఇస్తామని హడావుడి చేశాడు. సిరిసిల్లతోపాటు సిద్దిపేట, హైదరాబాద్ వంటి నగరాల్లో చిన్నచిన్న బిజినెస్‌లు చూపి కోట్ల రూపాయల్లో అప్పులు చేశాడు. బ్యాంకుల కంటే మూడింతల వడ్డీ వస్తుందని ఆశతో అనేక మంది డబ్బులు ఇచ్చారు. కానీ వ్యాపారి కొద్దిరోజులకే పరారయ్యాడు." "సిరిసిల్లలో మరికొందరు వ్యాపారులు వడ్డీలకు అప్పులు తీసుకొని కోట్ల రూపాయలకు ఐపీలు పెట్టి దర్జాగా తిరుగుతున్నారు."

చిరుఉద్యోగులు, చిన్నచిన్న వ్యాపారాలు, దుకాణాలు గుమస్తాలు, మరమగ్గాల అసాములు రూపాయి రూపాయి కూడబెట్టుకుని తెలిసిన వ్యాపారులే కదా అని వడ్డీకి డబ్బులు ఇచ్చిన వారు మోసపోతున్నారు. వడ్డీ రాకపోగా అసలు కూడా కోల్పోయి లబోదిబోమంటున్నారు. మరోవైపు వడ్డీలకు ఇవ్వడం చట్టబద్ధత లేకపోవడంతో పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకొని అప్పులు తీసుకున్న కొందరు డబ్బులు ఇచ్చిన వారిపైనే కేసులు పెడతామని బెదిరింపులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వడ్డీ వ్యాపారానికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో డబ్బు కోసం నిలదీస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు. మరోవైపు పోలీసులు కూడా అప్పు ఇచ్చిన వారిపైనే కేసులు పెడుతున్న సందర్భంలో ఇచ్చిన డబ్బులు రాక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. కేసులు, డబ్బులు ఇచ్చినవారు తిరిగి ఇవ్వని పరిస్థితులు పెరిగిపోతున్న క్రమంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అవసరాలకు అప్పు పుట్టని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో సాధారణ కుటుంబాల్లో చిన్నచిన్న అవసరాలకు అప్పుపుట్టని పరిస్థితుల్లో ఉన్నాయి. కనీసం చేబదుళ్లు కూడా ఇవ్వడం లేదు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి ఇబ్బందిగా మారింది. డబ్బులు సర్దుబాటు కానీ పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

బ్యాంకుల్లో పెరుగుతున్న డిపాజిట్లు

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పలువురు వ్యాపారులు మోసాలు చేసి ఐపీ పెట్టడం, ఊరు వదిలి పారిపోవడం వంటి సంఘటనలతో ఆర్థికంగా ఉన్నవారు అప్పులు ఇవ్వడం మానేశారు. వడ్డీ తక్కువ వచ్చిన బ్యాంకులు డిపాజిట్లు చేస్తున్నారు. స్థిరాస్తులపై దృష్టి పెడుతున్నారు. సిరిసిల్లలో సహకార బ్యాంకుల్లో డిపాజిట్లపై వడ్డీ కూడా ఎక్కువగానే ఇస్తుండడంతో వ్యాపారులు డిపాజిట్లు వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఏదైనా ఆర్థికఅవసరం పడితే సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో గతంలో ఎవరికైనా పైసలు అవసరం ఉంటే ఎవరో ఒకరు సర్దుబాటు చేసేవారు. మిత్రులు, బంధువులు అప్పుఇచ్చి ఆదుకే అవసరం తీరగానే చెల్లించే పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు అప్పులు ఇచ్చిన వారు తిరిగి డబ్బులు పొందడానికి శ్రమించాల్సిన పరిస్థితి ఉంది, పలువురు వడ్డీల పేరుతో కోట్లలో అప్పులు తీసుకొని చేస్తున్న మోసాలతో బ్యాంకులకు నమ్ముకుంటున్నారు.

అప్పులు ఇచ్చిపుచ్చుకునే సమయంలో మధ్యవర్తులుగా ఉన్నవారు సైతం దారుణమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. స్నేహితులు, బంధువుల మధ్య విభేదాలకు దారి తీస్తున్నాయి. నిజాయితీగా అప్పు తీసుకొని డబ్బులు చెల్లించేవారికి అప్పుపుట్టక ఇబ్బంది పడుతున్నారు.

అక్రమంగా ఫైనాన్స్ వ్యాపారం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అక్రమంగా ఫైనాన్స్, చిట్టీల దందాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకొని అప్పులు ఇస్తున్నారు. కనీస అనుమతి లేనివారు గుట్టు చప్పుడు కాకుండా ఫైనాన్స్ దందాలు కొనసాగిస్తున్నారు. వడ్డీ మీద వడ్డీ వేసి ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చితికిపోతున్న బతుకులు ఎన్నో ఉన్నాయి. జిల్లాలో గల్లీగల్లీలో వడ్డీరాయుళ్ల మధ్యతరగతి కుటుంబాల అవసరాలను ఆసరా చేసుకొని అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అప్పుల బాధను తట్టుకోలేక సిరిసిల్లలో నేత కార్మికులు...

మిగతా 8లో

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు..

- జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రవితేజగౌడ్

సిరిసిల్ల టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుర్ర రవితేజగౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల సమావేశ మందిరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజకీయాల్లో యువత అనే అంశంపై జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవితేజగౌడ్, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్‌తోపాటు నాయకులు మాట్లాడారు. యువత రాజకీయాల్లోకి వచ్చి నిజాయితీగా దేశ సేవ చేయాలన్నారు. దేశంలో అత్యధికంగా యువత శాతం ఉందని ప్రస్తుత దేశ రాజకీయాలను మార్చేందుకు అవినీతి అక్రమాల నిర్మూలనకు యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. చేస్తున్న సేవలు, ప్రవర్తన, ప్రజలతో నడుచుకునే విధానాలతోనే యువ నాయకులకు గుర్తింపు వస్తుందన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశంకు వివిధ పార్టీల యువ నాయకులు ఎర్రవెల్లి నాగరాజు, పల్లెర్ల శేఖర్, నరేష్‌నాయక్, జింక అనిల్, అన్నలదాస్ భాను, మునిగెల రాజు, ఈడుగురాళ్ల సురేష్, సిరిపురం మనోజ్, మంద రాజేందర్, బొర్ర రవీందర్, అంగూర్ రంజిత్, మాసం సుమన్, జితేందర్, సాయికుమార్, సందప్, బిట్ల బాబు, రాజు, స్వామి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పునర్ వైభవం తెచ్చేందుకు కృషి

- టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బోయినపల్లి జూలై 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు పునర్ వైభవం తీసుకొచ్చే దిశగా పూర్వ విద్యార్థులందరూ ముందుకు వచ్చామని టీఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. బోయినపల్లి మండలం విలాసాగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 70 ఏళ్ల నుంచి చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ టీఎన్జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులందరూ పాఠశాల అభివృద్ధి కోసం ఒక కమిటీ వేసుకున్నామని, అందరం కలిసి పాఠశాలకు పునర్వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

టీజీపేటా జిల్లా అధ్యక్షుడిగా సురేష్



తడుకల సురేష్, దుప్పటి రవికుమార్

సిరిసిల్ల టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం(టీజీపేటా) జిల్లా అధ్యక్షుడిగా తడుకల సురేష్, గౌరవ అధ్యక్షుడిగా దుప్పటి రవికుమార్‌ను నియమిస్తూ ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తురికి విజయసాగర్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు విజయసాగర్, ప్రధానకార్యదర్శి పాపన్నగారి నాగరాజుగౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు దుప్పటి రవికుమార్, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, గౌరవ అధ్యక్షులుగా ఎంపికైన సురేష్, రాజ్‌కుమార్‌లను అభినందించారు.

బీఆర్‌ఎస్వీ నాయకుల నిరసన



మానేరు వాగులో క్రికెట్ ఆడున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే సిరిసిల్ల మానేరు ఎడారిగా మారిందని బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ఆదివారం సిరిసిల్ల మానేరు వాగులో వినూత్న నిరసన చేపట్టారు. సిరిసిల్ల పట్టణాన్ని అనుకొని ఉన్న మానేరు వాగులో బీఆర్‌ఎస్వీ నాయకులు క్రికెట్ ఆడుతూ నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలలో సిరిసిల్ల మానేరు వాగు ఎడారిగా మారిందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పది సంవత్సరాల కాలంలో మానేరు వాగు జలకళతో ఆహ్లాదాన్ని ఇస్తూ సాగు, తాగు నీరుకు ఇబ్బంది లేకుండా రైతులు, ప్రజలు ఆనందంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది రైతులకు ప్రజలకు నీటి కష్టాలు వచ్చియని ఆరోపించారు. ఈ కార్యక్రమలో బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు మానాల అరుణ్, పట్టణ ఇన్‌చార్జి మెట్టల సాయిదీపక్, నాయకులు వెంకటరమణ, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఎన్నికల నామినేషన్లు పూర్తి



అధ్యక్ష పదవికి నామినేషన్ వేస్తున్న దూడం శంకర్

సిరిసిల్ల టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నికల నామినేషన్లు పూర్తి అయ్యాయి. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘం కళ్యాణ భవనంలో ఎన్నికల అధికార మామిడాల భూపతి సమక్షంలో సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలకు అభ్యర్థులు తమ మద్దతుదారులతో వచ్చి నామినేషన్లు వేశారు. సంఘం అధ్యక్ష పదవికి దూడం శంకర్, రెండు ఉపాధ్యక్షుల పదవులకు మోర రవి, గాజుల బాలయ్య, ప్రధాన కార్యదర్శి పదవికి మండల సత్యం, గజ్జెలి సత్యనారాయణ, కోశాధికారి పదవికి జిందం దేవదాస్, యెల్లె శ్రీనివాస్, గున్నాల కృష్ణప్రసాద్, సహాయ కార్యదర్శి పదవికి కోడం శ్రీనివాస్ నామినేషన్లు వేశారు. 39 వార్డుల డైరెక్టర్ల పదవికి 44 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా కొన్ని వార్డులో అభ్యర్థుల నుంచి నామినేషన్లు దాఖలు కాకపోవడం గమనార్హం. సంఘం అధ్యక్ష పదవికి ఒకటి, ఉపాధ్యక్ష రెండు పదవులకు రెండు, సహాయ కార్యదర్శి పదవికి ఒక్కో అభ్యర్థి మాత్రమే నామినేషన్ వేశారు. 39 వార్డులోని డైరెక్టర్ల పదవికి కొన్ని వార్డులకు ఒక్కొక్కరే నామినేషన్లు వేయడంతో స్క్రూటినీలో వీరంతా నిలిస్తే ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది.

వేములవాడ పట్టణాభివృద్ధికి కృషి

- భీమేశ్వర ఆలయంలో దర్శనాల కోసం పనులకు శంకుస్థాపన - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



భీమేశ్వర ఆలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని శ్రీభీమేశ్వర స్వామి వారి ఆలయంలో దర్శనాల ఏర్పాటు కోసం భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రూ.3.44 కోట్ల అభివృద్ధి పనులకు ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన ఆలయం, కోడెల మొక్కుల నిలయం, అత్యంత విశిష్టత కలిగిన దేవాలయంగా రాజన్న ఆలయం గుర్తింపు పొందిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, 8 మంది మంత్రుల సమక్షంలో రాజన్న ఆలయ అభివృద్ధికి గతఏడాదిలో భూమి పూజ నిర్వహించారని గుర్తు చేశారు. పలు రాష్ట్రాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని తెలిపారు. 2023 బడ్జెట్‌లో రూ. 50 కోట్లు, 2024-25 సంవత్సర బడ్జెట్‌లో రూ.100 కోట్లు రాజన్న ఆలయం, పట్టణాభివృద్ధి కోసం కేటాయించామని సూచించారు. ప్రభుత్వ సూచనలు సలహాలతో ఇప్పటికే పట్టణంలో రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టామని, రోడ్డు విస్తరణలోని ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితుల కోసం రూ. 47 కోట్లు పరిహారం కేటాయించారన్నారు. ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా మొదటి దశలో రూ.76కోట్లతో ఆలయాభివృద్ధి చేస్తున్నామని, శృంగేరి పీఠాధిపతుల, ఆలయ పరిరక్షణ కమిటీ సలహాలు, సూచనలతో ఆలయాభివృద్ధికి శాస్త్ర ప్రకారం ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఆలయ అభివృద్ధి విస్తరణకు ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని అన్నారు. ఆలయ విస్తరణ సమయంలో వచ్చే భక్తులకు దర్శనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ప్రాచీన ఆలయమైన భీమేశ్వర ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. పురాతన కాలం నుంచి రాజన్న ఆలయానికి తోడుగా భీమేశ్వర ఆలయం ఉందని, పురాణాల్లో చూసినట్లుగా శ్రీరాజరాజేశ్వర స్వామివారిని ఇంద్రుడు, శ్రీరాములు, పంచపాండవులు వచ్చి దర్శనం చేసుకుని భీమేశ్వర ఆలయంలో పూజలు చేసినట్లుగా తెలుస్తుందన్నారు. భీమేశ్వర ఆలయాన్ని కూడా అభివృద్ధి పథంలో తీసుకువెళుతున్నామని తెలిపారు. రాజన్న ఆలయ విస్తరణ జరుగుతున్న సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా భీమేశ్వర ఆలయంలో క్యూలైన్ల నిర్మాణం, అభిషేక మండపాలు, కల్యాణ మండపాలు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. రాజన్న ఆశీస్సులు తీసుకుని ఆదివారం శంకుస్థాపన నిర్వహించామని తెలిపారు. వీలైనంత త్వరగా ఆలయ విస్తరణ పనులు చేపడుతామని అన్నారు. రాజన్న భక్తులు, పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్న ఆలయ విస్తరణ అభివృద్ధి తొందరలోనే అందరి సహాయ సహకారాలతో పూర్తి చేస్తామని తెలిపారు. వేములవాడ పట్టణ ఆలయ అభివృద్ధి సమాంతరంగా చేస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు. వచ్చే బడ్జెట్‌తో కూడా నిధులు మంజూరు చేసుకుని ఆలయాభివృద్ధికి సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓవో రాధాబాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

8

విగ్రహం పిల్లర్ కూల్చివేయడం విచారకరం

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

8

'స్థానిక' ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

సిరిసిల్ల రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ఐక్యంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ కోరారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ, వేములవాడ నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాష్ రావుల అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చిన పోటీ చేసేందుకు బీజేపీ పార్టీ సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకే కాదు గ్రామీణ ప్రాంత వాసులకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమే అభివృద్ధి మంత్రాన్ని చేపడుతుందన్నారు. గ్రామాల్లో వార్డు అభ్యర్థుల స్థాయి నుంచి మండల పరిషత్, జిల్లా పరిషత్ స్థాయిలో బీజేపీ అభ్యర్థులు పోటీ చేయాలని వారి గెలుపుకోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలన్నారు. అంతేకాకుండా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్, రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు మ్యాన రాంప్రసాద్, కరీంనగర్ పార్లమెంటరీ కోకన్వీనర్‌లు అడెపు రవీందర్, దశరథం రెడ్డి, జిల్లాప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల కన్వీనర్‌లు మల్లారెడ్డి, మరుత సత్తయ్య, స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ పొన్నాల తిరుపతిరెడ్డి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్‌తదితరులు పాల్గొన్నారు.

27న చేయూత పెన్షన్‌దారుల సన్నాహక సదస్సు

- వీహెచ్‌పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గోపన్న



మాట్లాడుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి గోపన్న

సిరిసిల్ల టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చేయూత పెన్షన్ వికాలాంగుల ఆవేదన జిల్లా సన్నాహక సదస్సును ఈనెల 27న జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి ఎల్ గోపన్న అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లలో వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్), ఎమ్మార్పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోపన్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు వికలాంగులకు వెంటనే చేయుత పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు చేయుత పెన్షన్‌ను పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27 రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చేయూత పెన్షన్‌దారుల ఆవేదన జిల్లా సన్నాహక సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగా పాల్గొంటున్నారని అన్నారు. జిల్లాలోని వృద్ధులు, వికాలంగులు, వితంతులు ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులు, చేయుత పెన్షన్‌దారులు, వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. ఈసమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి, కన్వీనర్ ఎలగందుల బిక్షపతి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఆవునూరి ప్రభాకర్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మన్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షురాలు నడిమెల శోభారాణి, కోకన్వీనర్ పురుషోత్తమ రావు, నాయకులు కత్తెరపాక రవీందర్, లక్ష్మిరెడ్డి, మనోజ్‌కుమార్, కోడం శ్రీనివాస్, వాల్య నాయక్, వికలాంగులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా వెంకటేశం

వేములవాడ కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా మామిడిపల్లి వెంకటేశంను ఎన్నుకున్నట్లు సంఘం బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం స్థానిక బ్రాహ్మణ సంఘంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేశం, ఉపాధ్యక్షులుగా మధు ప్రవీణ్, దుమాల కార్తీక్, ప్రధానకార్యదర్శిగా నందగిరి రాజేంద్రశర్మ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా చొప్పకట్ల శ్రీకాంత్, హరాచారి మహేష్, సంయుక్త కార్యదర్శులుగా నమిలిగొండ నరహరి, సువర్ణ చంద్రశేఖర్, కోశాధికారిగా దుమాల కౌశిక్, వైదిక కమిటీ సభ్యులుగా కుంభకోణం రాజేందర్, గోపన్నగారి గణేష్, అత్తలూరి మల్లికార్జున్‌శర్మ, కోటేష్, కార్తీక్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షుడిగా ప్రతాప రామకృష్ణ హాజరైనట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సైకిలిస్టు మృతి

జగిత్యాల క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో రోడ్డు ప్రమాదంలో ఆదివారం సైకిలిస్టు పోచంపెల్లి పోచరాజు(48) అనేవ్యక్తి మృతిచెందాడు. గొల్లపల్లి మండలం రాపల్లి గ్రామానికిచెందిన పోచంపెల్లి పోచరాజు ఉపాధి కోసం జగిత్యాల పట్టణానికి వలసవచ్చి కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం పోచరాజు తనఇంటి నుంచి సైకిల్‌పై కొత్త బస్టాండ్ వైపు వెళ్తుండగా కరీంనగర్ వైపు వెళ్తున్న భారీ క్రేన్ ఢీకొని మృతిచెందాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రదీప్ కుమార్ అనేవ్యక్తి అజాగ్రత్తగా క్రేన్‌ను నడుపుతూ పోచరాజు నడుపుతున్న సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో పోచరాజు కిందపడగా అతడి తలపై నుంచి క్రేన్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సుల్తానాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం తొగర్రాయి గ్రామానికిచెందిన మత్తమర్రి మొండయ్య(75) అనేవృద్ధుడు మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మొండయ్య ఆదివారం మృతిచెందాడు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుప త్రిలో పోస్టుమార్టం చేశారు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

కొడిమ్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసిన కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన చిలువేరు అశోక్(36) అనే యువకుడు కరీంనగర్‌లోని ప్రైవేటుఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. తనకు పెళ్లి కావటం లేదని అశోక్ మనస్థాపానికి గురై ఈనెల 10న గడ్డి మందు తాగాడు. కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా ఆదివారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుని తండ్రి నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



పొలం వద్ద మృతిచెందిన మహేందర్

కోనరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నిమ్మపెల్లి గ్రామానికి చెందిన అనుముల మహేందర్ (45) అనేరైతు తన పంటపొలంలో పశువుల మేతకోసం గడ్డి కోయడానికి వెళుతున్నానని భార్య మమతకు చెప్పి వెళ్లాడు. సాయంత్రం వరకు కూడా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేసినా కలవకపోవడంతో ఆదివారం రాత్రి పంటపొలం వద్దకు వెళ్లిచూడగా విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు గుర్తించారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మమత, కూతురు, కుమారుడు ఉన్నారు.

ఇసుక లారీల పట్టివేత

ఇబ్రహీంపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న 10లారీలను ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై అనిల్ తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజేశ్వరావుపేట, సత్తక్కపల్లి గ్రామ శివారులోని ఎన్‌హెచ్63 రహదారిపై అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు లారీలను పట్టుకున్నామన్నారు. బండలింగాపూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు లారీలను పట్టుకున్నామన్నారు. మెట్‌పల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాంతయ్య ఫిర్యాదు మేరకు లారీల యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టైరు ఊడిపోయి డివైడర్‌ను ఢీకొట్టిన కారు

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న ఓ కారు ముందు టైర్ ఆదివారం ఊడిపోయింది. వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. వాహనంలో ప్రయాణిస్తున్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామంలోని ప్రశాంత్ తన కారులో కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లారెడ్డిపేట వైపు నుంచి రాచర్లగొల్లపల్లికి వెళుతున్నారు. హెచ్‌పీ బంకు సమీపంలోకి చేరుకోగానే వాహనం ముందు టైర్ ఊడిపోయింది. కారు ముందు భాగం దెబ్బతింది.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి శనివారం తెలిపారు. గ్రామ శివారులో నలుగురు వ్యక్తులు ఈనెల 19న రాత్రి పేకాట ఆడుతున్నారనే సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించామని పేర్కొన్నారు. తమ రాకను గమనించిన ఇద్దరు వ్యక్తులు పారిపోయారని చెప్పారు. మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7600 నగదుతో పాటు పేకాట ముక్కలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఓబులాపూర్ గ్రామ శివారులో..

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామ శివారులోని పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారినుంచి రూ.23వేల నగదును స్వాధీనం చేసుకుని, రెండు ద్విచక్ర వాహ నాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వ ధ్వంసం

జమ్మికుంట రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని 629సర్వే నంబర్‌లోగల ఎస్సారెస్పీ కాల్వను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇప్పటికే ఆ ప్రాంతంలోని ప్రభుత్వభూమి కబ్జా గురవుతోంది. మొత్తం కాల్వను ధ్వంసం చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇంత జరిగినా ఎస్సారెస్పీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ధ్వంసం అయిన ఎస్సారెస్పీ కాల్వ

వెల్‌నెస్ సెంటర్‌లో అరకొరగా మందులు

● ఇబ్బందులు పడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు





సుభాష్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆసుపత్రి ఆవరణలోని వెల్‌నెస్ సెంటర్‌లో అరకొర మందులతో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయుల కోసం 2018 జూన్ 28న జిల్లా జనరల్ ఆసుపత్రిలో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌కు ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయులు వైద్యం కోసం వస్తుంటారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వెల్‌నెస్ సెంటర్‌లో సేవలు అందిస్తారు. ఉమ్మడి జిల్లాలో 23 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తొమ్మిది వేలు, జర్నలిస్టులు 1500 మంది ఉన్నారు. వైద్యం కోసం వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చినవారు సంబంధిత డాక్టరుకు చూపించుకున్న తరువాత డాక్టరు రాసిన మందులు అక్కడ అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. మందులు స్థానిక మెడికల్ ఏజన్సీల నుంచి సరఫరా చేస్తున్నా, వాటిని మంజూరు చేసేది హైదరాబాద్‌లోనే. వెల్‌నెస్ సెంటర్ వారు మందులు కావాలని ఇండెంట్ పెడితే సంబంధిత అధికారి సెలవులో ఉంటే మందులు రావడం మరింత ఆలస్యం అవుతోంవది. బీపీ, షుగర్‌తోపాటు ఇతర వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయులు ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్ల నొప్పులు ఇతర శారీరక నొప్పులకు సంబంధించిన ఆయింట్‌మెంట్‌కూడా అందుబాటులో లేకపోవడం శోచనీయమని రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● బీపీ, షుగర్ బాధితులే ఎక్కువ...

వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చేవారిలో బీపీ, షుగర్, థైరాయిడ్ బాధితులే ఎక్కువగా ఉంటున్నారు. వెల్‌నెస్ సెంటర్‌లో డాక్టర్లు, సిబ్బంది సరిపడా ఉన్నప్పటికి మందులు మాత్రం అందుబాటులో ఉండడంలేదు. మూడు నెలలకు ఒకసారి మందులకు సంబంధించిన ఇండెంట్ పెడతారు. ఆ మందులు వచ్చేలోగా అప్పటి వరకు ఉన్న మందులు అయిపోతున్నాయి. ప్రతినెల ఎంతమంది బీపీ, షుగర్, థైరాయిడ్ పేషంట్లు వస్తు న్నారు, వారికి ఎన్ని మందులు అలవసరమనే విష యాన్ని దృష్టిలో పెట్టుకొని ఇండెంట్ పెడుతున్నామని సిబ్బంది అంటున్నారు. అవి రావడంలో ఆలస్యం అవుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు చెబుతున్నారు. సరిపడా మందులను అందుబాటులో ఉంచాలని ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికే యులు కోరుతున్నారు.

అన్ని మందులు అందుబాటులో ఉంచాలి...

-దారం శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు



డాక్టర్లు రాసిన మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయులు ఇబ్బందులు పడుతున్నారు. డయాబెటీస్ పేషంట్లకు ఇన్సులిన్, బీపీకి సంబంధించిన మందులతోపాటు, గుండెకు సంబంధించిన మందులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలి. వెల్‌నెస్ సెంటర్‌లో స్పెషలిస్టులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గుండె, నరాలకు సంబంధించిన మందులను వెల్‌నెస్ సెంటర్‌లో అందుబాటులో ఉంచాలి.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయాలు

సుల్తానాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని గట్టేపల్లి గ్రామానికిచెందిన వజీర్ ఆదివారం రాత్రి బైక్‌పై పెద్దపల్లి రోడ్డులో గల పెట్రోల్‌బంకువద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో వజీర్ తీవ్రంగా గాయపడగా పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో మల్యాలకుచెందిన బావు చంద్రయ్యకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని వావిలాలపల్లికి చెందిన కె అంజనేయలు మే27న తన సెల్‌ఫోన్‌ను ఆరేపల్లి దగ్గర పోగొట్టుకున్నాడు. కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ టెక్నాలజీతో జగి త్యాలలోఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను బాధితుడికి అప్పగించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చూపిస్తున్న త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని హౌసింగ్‌బోర్డుకాలనీ గౌతమ్ మెడికల్ షాపులో జరిగిన చోరీ కేసులో నిందితులను త్రీటౌన్ పోలీసులు అరెస్టుచేశారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ జాన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ఈ నెల 16న గౌతమ్ మెడికల్ షాపులో జరిగిన చోరీలో రూ.3 వేల నగదు, ఒక సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు హౌసింగ్‌బోర్డు కాలనీలో అద్దెకు ఉంటున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన సబ్బీర్ ఆలం అలియాస్ అజ్మల్ హుస్సేన్ అలియాస్ సకీర్ చోరీకి పాల్పడ్డట్లు గుర్తించారు. గతంలో సిద్దిపేటలో ఒక హోటల్‌లో పని చేసిన్నప్పుడు అతడికి పరిచయమైన బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ రిజ్వాన్ ఆలం, మహ్మద్ ఫర్హాన్ ఆలంను పిలిపించుకొని వారితో కలిసి దొంగతనం చేసినట్లు విచారణలో వెల్లడించాడు. వీరు గతంలో జరిగిన పలు దొంగతనాల కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు, ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సై జగదీశ్వర్, క్రైం పార్టీ కానిస్టేబుళ్ల సాయినేత్ర, ప్రశాంత్‌ను అభినందించారు.

బాలికపై అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్టు

తిమ్మాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుగునూర్ శివారులోని కాకతీయకాలువ పక్కన ఈనెల 18న ఓ మైనర్ బాలికపై అత్యాచారయత్నం చేసేందుకు ప్రయత్నించిన నిందితుడైన బాలిక మేనమామను ఆదివారం పట్టుకున్నట్లు తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ తెలిపారు. బోయిన్‌పల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై ఇప్పటికే బోయిన్‌పల్లిలో రౌడీషీట్ ఉందని సీఐ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్‌ను సీఐ సదన్ కుమార్‌తోపాటు ఇతర పోలీస్ అధికారులు అభినందించారు.

ఇంటర్ చదువుకు విద్యార్థుల అవస్థలు

● మండలంలో జూనియర్ కాలేజీ లేక ఇబ్బందులు



బస్సెక్కి కాలేజీకి వెళుతున్న విద్యార్థులు

గన్నేరువరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ప్రతిరోజు కరీంనగర్‌కు 40కిలోమీటర్ల దూరం ప్రయాణించి చదువుకుంటున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ఆర్టీసీ, కాలేజీల బస్సులలో ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నారు. కొందరు విద్యార్థులు పక్కనున్న ఇల్లంతకుంట మండలకేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలకు వెళుతున్నారు. ఇల్లంతకుంటకు నేరుగా బస్సుసౌకర్యం లేకపోవడంతో పొత్తూరు వరకు వెళ్లి అక్కడి నుంచి మరోబస్సు ద్వారా ఇల్లంతకుంటకు వెళుతున్నారు. ప్రతిరోజు ఇలా విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ కాలేజీకి అనువైనస్థలం ఉంది. అక్కడ కాలేజీ ఏర్పాటు చేయాలని గతంలో నివేదికలు పంపినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టడంలేదు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. అప్పటి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కళాశాలల్లో డ్రగ్స్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించండి

● రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



ఎల్ఎండీలోని అతిథి గృహం వద్ద సీఐ సదన్‌కుమార్‌కు సూచనలు చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

తిమ్మాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో డ్రగ్స్‌పై విద్యార్థులకు ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించాలని తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్‌ను రాష్ట్ర ఐటీశాఖమంత్రి శ్రీదర్ బాబు ఆదేశించారు. ఆదివారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో నీటిపారుదలశాఖ అతిథి గృహంలో కాసేపు ఆగిన మంత్రి అక్కడే ఉన్న కరీంనగర్ ఏసీపీ వెంకటస్వామి, తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్‌తో మాట్లాడారు. డ్రగ్స్‌పై విద్యార్థులకు, సంబంధిత యాజమాన్యాలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక ఎన్నికలకు సమాయత్తమవుతున్నట్లు జిల్లాకు కూడా ఎన్నికలకు సంబంధించి కొంతసమయం కేటాయించాలని కాంగ్రెస్‌నాయకులు మంత్రి శ్రీదర్‌బాబును కోరారు. కార్యక్రమంలో సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

వీణవంక, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికిచెందిన అన్వేష్ తండ్రి మందలించాడని మనస్థాపానికి గురై ఇంటి నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం కరీంనగర్‌కు వెళ్లి తన బావకి ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్ చేశాడు. వెంటనే అతడు తల్లిదండ్రులకు సమాచారం అందిచారు. వారు పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో ఫోన్‌నంబర్‌ను ట్రెస్‌చేసి పోలీసులు అన్వేష్‌ను తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసులు వెంటనే స్పందించి యువకుడిని కాపడినందుకు తల్లిదండ్రులు, గ్రామస్థులు ఎస్ఐకి, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

బండరాళ్లు పడి బాలుడి మృతి

బీర్‌పూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం రేకుపెల్లి గ్రామంలో ఆదివారం బండరాళ్లు పడి కడ ధనూష్(11) అనే బాలుడు మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపినవివరాల ప్రకారం కడ రాజేందర్-లక్ష్మి దంపతులు ఆదివారం తమ పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లారు. వారితో కుమారుడు ధనూష్, బంధువైన మరో బాలుడు అకీల్ వెళ్లారు. పొలం పక్కన కుప్పగా వేసి ఉన్న బండరాళ్ళపై కూర్చొని బాలురు ఆడుకుంటున్న క్రమంలో బండరాళ్ళు కదిలి జారి పడిపోయారు. దీంతో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన రాజేందర్ జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ధనూష్ మృతి చెందాడు. అకీల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ధనూష్ తుంగూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. పోలీసులు విచారణ చేపడుతున్నారు.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు..

● ప్రారంభానికి నోచుకొని షాపింగ్ కాంప్లెక్స్

● దేవాదాయశాఖ ఆదాయానికి గండి



అసంపూర్తిగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ భవనం

ఇల్లందకుంట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన షాపింగ్‌కాంప్లెక్స్ భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. మండలకేంద్రంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్‌పథకం కింద ఐదేళ్లక్రితం సీతారామచంద్ర స్వామి ఆలయసమీపంలో భక్తుల సౌకర్యార్థం షాపింగ్ కాంప్లెక్స్ భవనం నిర్మాణ పనులు రూ.50లక్షలతో చేపట్టారు. భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకోగా నిధులు లేమితో పనులు నిలిచిపోయాయి. భవన నిర్మాణం పూర్తయితే 5షాపింగ్‌గదులు, పైఅంతస్తులో భక్తుల సౌకర్యార్థం అద్దెగదులు ఇచ్చేందుకు వీలువుగా ఉంటుంది. దీంతోపాటు దేవాదాయశాఖకు ఆదాయం కూడా సమకూరుతుంది. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ భవనం వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి మిగిలిన భవన నిర్మాణపనులకు నిధులు కేటాయించి ఉపయోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

● ఉపయోగంలోకి తెస్తాం..

- ఇంగిలే రామారావు, ఆలయ చైర్మన్, ఇల్లందకుంట



షాపింగ్‌కాంప్లెక్స్ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకువస్తాం. మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకనిధులు కేటాయించేలా కృషిచేస్తాం. అతిత్వరలో మిగిలిన పనులు పూర్తిచేసి భక్తులకు ఉపయోగపడేలా చేస్తాం.



● నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి..

- కందుల సుధాకర్, ఆలయ ఈవో, ఇల్లందకుంట

భవన నిర్మాణం నిధులు లేక ఆగిపోయింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నావంతు కృషిచేస్తాను. దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు నిధుల కేటాయింపునకు నివేదిక పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తిచేస్తాం.

పండుటాకులపై పట్టింపేదీ?

● వృద్ధుల డే కేర్ సెంటర్‌పై పర్యవేక్షణ కరువు

● ఊడిపోయిన సీలింగ్ రేకులు

● భయాందోళనలో వృద్ధులు



వృద్ధుల డేకేర్ సెంటర్ బోర్డుపై ఊడిపోయిన అక్షరాలు



కేంద్రంలో ధ్వంసమైన సీలింగ్

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ వృద్ధుల డేకేర్ సెంటర్‌పై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నిరాదరణకు గురైన వృద్ధులకు ఆశ్రయం కల్పించేలా ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్ సమస్యలమయంగా మారింది. 18 మందికి నీడను అందించాల్సిన కేంద్రంలో ప్రస్తుతం ఐదుగురే ఉన్నారు. కేంద్రంలోని గోడకు వర్షపు నీటి జల్లు వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. సీలింగ్ రేకులు ధ్వంసమయ్యాయి. అటువైపు వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. అధికారుల పట్టింపులేనితనం వల్ల వృద్ధుల డే కేర్ సెంటర్‌లో ఎప్పుడేం జరుగునోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామని వృద్ధులు వాపోతున్నారు.

● ఏఎన్‌ఎం పెద్ద దిక్కు

వృద్ధుల డే కేర్ సెంటర్‌ను ఆధునిక వసతులతో తీర్చిదిద్దారు. రెండేళ్ల కిందట అందుబాటులోకి వచ్చిన కేంద్రం నిరాదరణకు గురైనా ఎంతో మందిని అక్కున చేర్చుకుంది. ప్రస్తుతం కేంద్రంలో కో-ఆర్డినేటర్ మమత, ఏఎన్‌ఎం సుజాత, వంట మనిషితో పాటు ఒక సహాయకుడు విధులు నిర్వర్తిస్తున్నారు. కో-ఆర్డినేటర్ మమత తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోనూ బాధ్యతలను కొనసాగిస్తుండడంతో కేంద్రానికి ఏఎన్‌ఎం సుజాత పెద్దదిక్కుగా మారింది. వంట మనిషి ఉదయం భోజనం తయారుచేసి వెళ్లిపోతుంది. భారీ వర్షానికి భవనంలోని ఓ గోడ పైకప్పు నుంచి నీటి చుక్కలు పడుతున్నాయి. అటు వైపు వెళితే కాలు జారే ప్రమాదం నెలకొంది. సీలింగ్ రేకులు, బోర్డు ధ్వంసమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వృద్ధుల డే కేర్ సెంటర్‌పై ప్రత్యేక చొరవ చూపి మరమ్మత్తులు చేయించాలని వృద్ధులు కోరుతున్నారు.

● మరమ్మతు చేయిస్తాం..

- లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

మండల కేంద్రంలోని వృద్ధుల ఆశ్రమం, డే కేర్ సెంటర్‌ను సందర్శించి సమస్యలను గుర్తిస్తాం. కోతుల వల్ల రేకులు, బోర్డుపై అక్షరాలు ధ్వంసమయ్యాయి. పైకప్పు నుంచి వర్షం నీరు రాకుండా మరమ్మతులు చేయిస్తాం. ఎల్లారెడ్డిపేట, మండేపల్లిలోని రెండు కేంద్రాల్లో మొత్తం 40 మంది వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నాం. కేంద్రంలోని వృద్ధులను వారం, పదిహేను రోజులకొకసారి రెండు కేంద్రాలకు అటుఇటు తీసుకెళుతుంటాం. ప్రస్తుతం ఎల్లారెడ్డిపేటలోని కేంద్రంలో ఐదుగురు ఆశ్రయం పొందుతున్నారు. కేంద్రంలో అన్ని వసతులు కల్పించి వృద్ధులకు ఏలోటు లేకుండా చూస్తాం.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

● కోడె మొక్కులు చెల్లించుకున్న భక్తజనం



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఉదయాన్నే ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, కోడెమొక్కు క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయం లోకి చేరుకుని పార్వతిరాజరాజేశ్వర స్వామివార లను దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. పరివార దేవతాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని బద్దిపోచమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని తిరుగు ప్రయాణమ య్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరిండెంట్లు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ఉప్పొంగుతున్న మూలవాగు



మామిడిపల్లి వద్ద పారుతున్న మూలవాగు

కోనరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూలవాగు ఉప్పొంగుతోంది. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి ప్రాజెక్టు నుంచి వస్తున్న మూలవాగు నీరు ఆదివారం సాయంత్రం మామిడిపల్లి వరకు చేరుకుంది. దీంతో తహసీల్దార్ విజయలక్ష్మితో పాటు పలువురు అధికారులు మూలవాగును సందర్శించారు. కాగా, మూలవాగు పరిసర ప్రాంతాల రైతులు పూజలు నిర్వహించారు.

భారత్ విభూషణ్ పురస్కారాల ప్రదానం

కరీంనగర్ కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫిలిం భవన్‌లో ఆదివారం మంథనికి చెందిన గౌతమి సాహితీ కళా సేవా సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీధర్ అధ్యక్షతన భారత్ విభూషణ్ జాతీయ స్థాయి పురస్కారాల ప్రదానంచేశారు. ఈ సందర్భంగా శతాధిక గ్రంథప్రచురణకర్త, రచయిత వైరాగ్యం ప్రభాకర్ మాట్లాడుతూ విభిన్న రంగాల్లో సేవలందిస్తున్నవారిని ప్రోత్సహించడంలో సంస్థ ముందంజలో ఉంటుందన్నారు. అంతకుముందు శ్రీధర్ సంపాద కత్వంలో వెలువడిన తల్లీ నీకు వందనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. చర్మవ్యాధి నిపుణురాలు, ప్రతిమ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ గీతారెడ్డి, కవి పొర్ల వేణుగోపాలరావు, సామాజిక కార్యకర్త దీటి గోపాల కృష్ణయ్య (కడప), బ్యూటీషియన్ కుంచాల లావణ్య, సేంద్రీయ వ్యవసాయ పరిశోధకుడు యాదగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



భారత్ విభూషణ్ జాతీయస్థాయి పురస్కారాలు అందుకున్న రచయితలు

నిరుపయోగంగా వార సంతలు

- నిర్మించి రెండు సంవత్సరాలు గడిచినా ప్రజలకు అందుబాటులోకి రాని వైనం
- పశువులకు, గ్రాసానికి, స్థానికుల అవసరాలకు ఉపయోగించుకుంటున్న స్థానికులు
- రూ. లక్షల నిధులు దుర్వినియోగం



మహాత్మానగర్ వారసంత

తిమ్మాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల్లో నిర్మించిన వారసంతలు నిరుపయోగంగా మారాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా తిమ్మాపూర్ మండలంలోని మహాత్మనగర్, నుస్తులాపూర్, రేణికుంట, నల్లగొండ, కొత్తపల్లి, మొగిళిపాలెం గ్రామాల్లో వార సంతలను నిర్మించేందుకు ప్రతిపాదించారు. వాటిలో మహాత్మానగర్, రేణికుంట, నల్లగొండ గ్రామాల్లో వార సంతల నిర్మాణం పూర్తయ్యాయి. నుస్తులాపూర్‌లో పనులను అర్థాంతరంగా నిలిపి వేశారు. కొత్తపల్లి, మొగిళిపాలెంలో పనులు ప్రారంభించలేదు.

- మహాత్మానగర్ గ్రామ పంచాయితీని సమీపంలో 15లక్షల నిధులతో నిర్మించిన వార సంత అధ్వాన స్థితిలో ఉంది. 2023 అక్టోబరు 4న అప్పటి ఎమ్మెల్యే వార సంతను అట్టహాసంగా ప్రారంభించారు. ఇప్పటి వరకు ఒక్క రోజూ వారసంతలో కూరగాయాలు అమ్మలేదు. ప్రస్తుతం వార సంతలో స్థానికులు పశువులను కట్టేసుకుని పశుగ్రాసం నిల్వ ఉంచుకుంటున్నారు. గ్రామం లో కూరగాయలు రోడ్డు పక్కన విక్రయిస్తు న్నారు.

- రేణికుంటలో వార సంత నిర్మాణం పూర్తి అయినప్పటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో వారసంత ముందు కూర్చుని కూరగాయలు విక్రయించుకుంటున్నారు. నల్లగొండ గ్రామంలో నిర్మా ణం పూర్తయిన వార సంత కూడా ప్రారంభం కాలేదు.



రేణికుంటలో నిరుపయోగంగా ఉన్న వారసంత

● మానకొండూర్ మండలంలో..

మానకొండూర్: మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామంలో నిర్మించిన వారసంత నిరుపయోగంగా మారింది. 2020-21 సంవత్సరంలో 12 లక్షలతో వారసంతను నిర్మించారు. ప్రారంభించి రెండేళ్లయినా వారసంత ఉపయోగంలోకి రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వారసంతను ఉపయోగంలోకి తీసుక రావాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నిర్మాణం ప్రారంభించి మధ్యలోనే నిలిపివేసిన నుస్తులాపూర్‌లో వారసంత



నల్లగొండలో నిరుపయోగంగా ..

● ప్రజలకు అందుబాటులోకి తేవాలి

మహాత్మానగర్, నల్లగొండ, రేణికుంట గ్రామంలో లక్షలు వెచ్చించి నిర్మించిన వారసంతలను తక్షణమే అందుబాటులోకి తేవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మహత్మానగర్ వార సంతను ప్రజలకు అనువైన స్థలంలో నిర్మించలేదని, రాజీవ్ రహదారికి సమీపంలో ఈ వార సంత నిర్మించి ఉంటే ఇటు స్థానికంగా ఉంటే మత్యకారులకు, కూరగాయల విక్రయదారులకు ఉపయోగకరంగా ఉండేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వారసంతలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని పాదయాత్ర



మల్లాపూర్‌లో పాదయాత్రలో పాల్గొన్న పసుపుబోర్డు చైర్మన్ గంగారెడ్డి, బీజేపీ నాయకులు

మల్లాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఆదివారం మల్లాపూర్ మండల కేంద్రం నుంచి ముత్యంపేట వరకు బీజేపీ ఆధ్వర్యంలో రైతులు పాద యాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన నిజామాబాద్ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డి ముఖం చాటేశారని విమర్శించారు. షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి కమిటీ వేశామని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం నేటికీ హామీలు అమలుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో పంటలు సాగు చేద్దామంటే నీరు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన విమర్శించారు. అనంతరం బీజేపీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, రైతులు మల్లాపూర్ నుంచి కుస్తాపూర్, సిర్పూర్, రాఘవపేట, హుస్సేన్‌నగర్, ముత్యంపేట గ్రామాల మీదుగా షుగర్ ఫ్యాక్టరీకి పాదయాత్రగా వెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు, నాయకులు వడ్డేపల్లి శ్రీనివాస్, చెట్పేని రఘు, ప్రశాంత్, సాయిరామ్, రమణ చారి, మల్లారెడ్డి, రాకేష్, సందీప్, నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఆగమైన ఉద్యోగుల బతుకులు



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి

సుభాష్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగుల బతుకులు ఆగమయ్యాయని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంప్లాయిస్ జేఏసీ జిల్లాచైర్మన్, టీఎన్‌జీవోస్ ఫంక్షన్‌హాలులో వ్యవసాయశాఖ మినిస్ట్రియల్ స్టాఫ్ అసోసియేషన్ (టీఏఎంఎస్ఏ) ఉమ్మడిజిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖలో ఉన్న క్యాడర్‌స్ట్రెంత్, విభాగసమస్యలు, ఉద్యోగుల సమస్యలు, సంఘానికి సంబంధించిన వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించారు. అధికారులతో చర్చలు జరిపి పరిష్కరించేందుకు కృషిచేయాలని సంఘం నిర్ణయించింది. అనంతరం దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం పేరుతో 33జిల్లాలుగా విభజన చేసి ఆర్డర్ టు సర్వీస్ పేరిట అర్ధరాత్రి వాట్సాప్‌లలో ఆర్డర్లు ఇస్తే వాటి ఆధారంగా జిల్లాలను ప్రారంభించినట్లు చెప్పారు. కొత్తజిల్లాలను ఏర్పాటు చేశారు కానీ క్యాడర్ స్ట్రెంత్‌ను పెంచలేదని, అశాస్త్రీయంగా జోన్లను విభజించి స్థానికతను పరిగణలోకి తీసుకోకుండా ఉద్యోగులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతీనెల ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నారని, అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, పీఆర్‌సీ, హెల్త్‌కార్డుల విషయంలో సరైన నిర్ణయం తీసుకునే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగులు వేరు కాదని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ సంక్షేమపథకాన్ని ప్రజల్లోకి తీసుకుపోయి సమర్థంతంగా అమలు చేసేది ప్రభుత్వ ఉద్యోగులేనని అన్నారు. అలాంటి ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కమిటీల పేరిట కాలయాపన చేయకుండా సత్వరమే పరిష్కరించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వ్యవసాయ మినిస్ట్రీయల్ ఉద్యోగుల కేంద్రసంఘం అధ్యక్షుడు శ్రీహరి, సెక్రెటరీ అరుణ్‌కుమార్, టీఎన్‌జీఓఎస్ జిల్లాసెక్రెటరీ సంగం లక్ష్మణ్ రావు, టాంసా జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, సెక్రెటరీ లవకుమార్, ఒంటెల రవీందర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలను అమలు చేయాలి

● ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్

గంభీరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్ స్కావెంజర్స్‌కు కనీసవేతనాలను అమలు చేయా లని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీటూపీజీ హైస్కూల్‌లో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ స్వీపర్, స్కావెంజర్స్‌కు 15వేలు కనీస వేతనాన్ని అమలు చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ జీతాలు రావడం లేదన్నారు. పాఠశాలలను శుభ్రపరుస్తున్నా వారి శ్రమను గుర్తించడం లేదని, ఇప్పటికైనా నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆదర్శ కమిటీలు రద్దు చేయాలని, కార్మికులుగా గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాల యూనిఫాం అమలు చేయాలని, 65ఏళ్లు నిండిన వారందరికి 9వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, దేవయ్య, మల్లేశం, మహేష్, లత, లావణ్య రజిత, సునిత, అనిత తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా పంచాయతీ కాంప్లెక్స్ భవన సముదాయం



నిరుపయోగంగా ఉన్న దుకాణ సముదాయం

రామడుగు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ దుకాణ సముదాయ భవనం నిరుపయోగంగా మారింది. దీంతో పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. బస్టాండ్‌లోనే భవనం ఉన్నా అద్దెకు ఉండడానికి వ్యాపారులు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటివరకు మూడుసార్లు అద్దెకు వేలం వేశారు. ఎవరూ ముందుకు రాలేదు. సముదాయంలో ప్రస్తుతం షాపునకు 3వేల రూపాయల అద్దెపెట్టడంతోపాటు ఒకేసంవత్సరం గడువు విధించడంతో వ్యాపారులు ఆసక్తి చూపించడం లేదని తెలుస్తున్నది. అక్కడ ఏదైనా వ్యాపారం ప్రారంభిస్తే సంవత్సరం లోపు లాభాలు ఆర్జించే సమయంలో మరోసారి టెండర్లు వేస్తే తమకు తిరిగి వస్తుందో రాదోనని అనుమానంతో ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తున్నది. ఇప్పటికైనా అధికారులు వ్యాపారుల అభిప్రాయం తెలుసుకుని టెండర్లు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దేశవ్యాప్తంగా 5 కోట్ల కేసులు పెండింగ్

కరీంనగర్ క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో 5కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్‌ఫౌండర్, చైర్మన్ భగవాన్జిరేయన్ తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని కృషి భవన్‌లో ఫోరమ్ ఫర్ ఫాస్ట్ జస్టిస్ ఆధ్వర్యంలో కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడిజిల్లాల అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ముంబాయికి చెందిన ఫోరమ్‌ఫర్‌ఫాస్ట్‌జస్టిస్ ఫౌండర్ చైర్మన్ భగవాన్జిరేయన్, కన్వీనర్ ప్రవీణ్‌పటేల్ మాట్లాడుతూ తెలంగాణలో 11లక్షల పై చిలుకు కేసులు ఉండగా కరీంనగర్ జిల్లాకు సంబంధించి 38,600కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనంతరం పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు తీసుకునేచర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లాన్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు జూపల్లి శ్రీని వాస్‌రావు, మంచిర్యాల జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జగన్, సుల్తానాబాద్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సులకు అనుమతి వచ్చేనా..!

- వైద్య కళాశాల ప్రారంభమై నాలుగేళ్లు
- పీజీ కోర్సులకు దరఖాస్తు
- 24 సీట్ల కోసం రూ.94 లక్షలు డిపాజిట్

కళ్యాణ్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో పీజీ కోర్సుల కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసినా ఇప్పటి వరకు అనుమతులు రావడం లేదు. కళాశాల ప్రారంభమై నాలుగేళ్లవుతున్నా పీజీ కోర్సులు ఏర్పాటు చేయడంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలను చేపట్టలేదు. సింగరేణి మెడికల్ కళాశాలకు అనుబంధంగా 365 పడకల ఆసుపత్రి ఉన్నప్పటికీ ఆసుపత్రితోపాటు మరో 345పడకల ఐదు అంతస్థుల భవన నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నది. ఈ ఏడాది చివరికల్లా భవనాన్ని ప్రారంభించాలని, అన్నీ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆరు విభాగాల్లో పీజీ కోర్సులను ఏర్పాటు చేయాలని ఏడాది క్రితం కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు జాతీయ వైద్య విద్యా కమిషన్‌కు దరఖాస్తు చేశారు. సిమ్స్ కళాశాలలో పీజీ సీట్లను కేటాయించడానికి జాతీయ వైద్య విద్య కమిషన్ అంగీకరించినప్పటికీ దీనిపై స్పష్టత రాలేదు. ఆరువిభాగాల్లో 24సీట్ల కోసం ప్రభుత్వం రూ.94లక్షలు కలెక్టర్ డిపాజిట్‌ను కూడా చేసి నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు పంపారు. డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ కూడా సిమ్స్‌కు 24సీట్లు కేటాయించాలని నివేదికను కూడా పంపారు.

● ఆరు పీజీ కోర్సులకు దరఖాస్తు

ఈ ఏడాది సిమ్స్ మెడికల్ కళాశాలలో 4వ సంవత్సరం క్లాసులు అక్టోబరులో ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు 4వ సంవత్సరం పూర్తి చేసిన తరువాత పీజీ సీట్ల కోసం పోటీ పడతారు. ప్రభుత్వ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో సీటు వస్తే సుమారు కోటి రూపాయల వరకు ఆదా అవుతుంది. ఎమర్జెన్సీ మెడిసిన్ 4సీట్లు, ఆర్థో 4సీట్లు, గైనకాలజీ 4సీట్లు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ 4సీట్లు, పిడియాట్రిక్ 4సీట్లు మొత్తం 24సీట్ల కోసం దరఖాస్తు చేశారు. మొదటి సంవత్సరం 24సీట్లు మంజూరైతే ఇక్కడ వైద్య విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. సిమ్స్ మెడికల్ కళాశాలలో ఇప్పటికే 15శాతం ఆల్ ఇండియా కోటా సీట్లతో ఇతర రాష్ట్ర విద్యార్థులు ఈ కళాశాలలో చేరేందుకు పోటీ పడుతున్నారు.



సిమ్స్ మెడికల్ కళాశాల ముఖ ద్వారం

● సింగరేణి నిధులతో సిమ్స్ కళాశాల ఏర్పాటు

సింగరేణి రూ.520కోట్లతో సిమ్స్ మెడికల్ కళాశాలకు కేటాయించింది. ఈ కళాశాల 2022-23లో ప్రారంభం కాగా 150సీట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 15శాతం ఆల్ ఇండియా కోటాకు గాను మిగతా 7శాతం సింగరేణి ఉద్యోగుల పిల్లలకు కేటాయించగా, మిగతా 78శాతం రాష్ట్ర కోటాకు కేటాయించింది. అన్నీ వసతులు సింగరేణి మెడికల్ కళాశాలలో చేరడానికి విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు.

● పీజీ కళాశాలను పెద్దపల్లిలో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు...

కొత్తగా ప్రభుత్వం 15పీజీ కళాశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుండగా పెద్దపల్లిలో వంద పడకల ఆసుపత్రి మాత్రమే ఉన్నది. రామగుండంలో ఏర్పాటు చేస్తే ఇటు వైద్య విద్యార్థులతోపాటు ఆసుపత్రికి వచ్చే రోగులకు కూడా ఉపయోగం ఉంటుంది. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజుకు 1500 నుంచి 1800మంది రోగులు వైద్య చికిత్సల కోసం వస్తుండడంతో పాటు ఇన్ పేషెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. దీనికి తోడు కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల, పారా మెడికల్ కళాశాల అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ పీజీ కోర్సులు వస్తే యేటా 25నుంచి 30సీట్లు పెరిగే అవకాశం ఉంది.

ఆగస్టులో అనుమతులు వచ్చే అవకాశం...

- ప్రిన్సిపాల్ హిమబిందు



సిమ్స్ కళాశాలలో పీజీ సీట్ల కోసం రూ.94లక్షలు డిపాజిట్ చేశాం. ఆగస్టులో అనుమతులు లభిస్తాయనే ఆశిస్తున్నాం. గత ఏడాదిలోనే రావాల్సి ఉంది. ఆర్థో, ఎమర్జెన్సీ మెడిసిన్, గైనకాలజీ, పిడియాట్రిక్, జనరల్ సర్జన్ విభాగాలకు దరఖాస్తు చేశాం. ఈ ఏడాది 4వ సంవత్సరం అడ్మిషన్లు కూడా ప్రారంభం కానున్నాయి. సిమ్స్‌లో 600మంది విద్యార్థులు ఈ ఏడాదితో విద్యను అభ్యసించనున్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల ఇబ్బందులు

● పట్టించుకోని అధికారులు



ఇల్లందకుంటలో బస్ షెల్టర్ లేక చెట్ల కింద ఉన్న ప్రయాణికులు

ఇల్లందకుంట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిలువ నీడ లేక పాట్లు పడుతున్నారు. బస్సులకోసం గంటల తరబడి రోడ్డుపైనే పడిగాపులు కాస్తున్నారు. ఇల్లందకుంట మండలంగా ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. సీతారామచంద్ర స్వామిదర్శనానికి వరంగల్, భూపాలపల్లి, సింగరేణి ప్రాంతాల నుంచి అనేకమంది భక్తులు ఇక్కడికి వస్తారు. వారు తిరుగు ప్రయాణం చేసే సమయంలో బస్సులకోసం గంటలతరబడి ఎండలోనే రోడ్డుపై నిలబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండకూ ఎండుతూ వానకు తడుస్తూ బస్సులు వచ్చేవరకు రోడ్డుపైనే నిలబడాల్సి వస్తుంది. బస్‌షెల్టర్ ఏర్పాటుచేయాలని అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. ప్రజాప్రతినిధులు మారుతున్నా మండల కేంద్రంలో బస్‌షెల్టర్ కల నెరవేరడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

● ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

- కందాల కొంరెల్లి, ఇల్లందకుంట



మండల కేంద్రానికి వివిధ పనుల కోసం ప్రజలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. బస్‌షెల్టర్ లేకపోవడం వల్ల చెట్ల కింద రోడ్డుపైన బస్‌కోసం నిలబడాల్సి వస్తోంది. అధికారులు వెంటనే బస్ షెల్టర్ నిర్మించాలి.

ఊరూరా బోనాల సందడి

- ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్న భక్తులు



సిరిసిల్లలో బోనాలతో మహిళలు



సిరిసిల్ల పోచమ్మ దేవాలయం వద్ద భక్తుల క్యూ



రేపాక గ్రామంలో బోనాలు తీస్తున్న మహిళలు

సిరిసిల్ల టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో సిరిసిల్ల మహిళలు పెద్ద సంఖ్యలో బోనమెత్తారు. వాడవాడలా నుంచి మహిళలు డప్పుచప్పుల మధ్య బోనమెత్తుకొని ప్రదర్శనగా సిరిసిల్ల పట్టణం పోచ్చమ్మవీధిలోని అమ్మవారి దేవాలయాని చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించుకున్నారు. పట్టణంలోని వివిధ కుల సంఘాలు, ప్యాసింజర్ ఆటో, గూడ్స్ ఆటో, కారు అసోసియేషన్ల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను నిర్వహించారు. పోచ్చమ్మ దేవాలయానికి బోనాలతో పెద్దసంఖ్యలో మహిళలు చేరుకోవడంతో భక్తుల సందడి నెలకొంది.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, వెంకటాపూర్, బండలింగంపల్లి, నారాయణపూర్, అక్కపల్లి, రాజన్నపేట, దుమాల తదితర గ్రామాల్లో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో గ్రామ దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీకి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలను చల్లగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాల్లో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఇల్లంతకుంట, రేపాక తదితర గ్రామాల్లో డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘ అధ్యక్షుడు పొట్ట లింగం, సంఘ నాయకులు తోడేటి కనుకయ్య, దుగ్యాని మహేందర్, సీత మల్లయ్య, కొడిసెల చంద్రయ్య, దుగ్యాని కుంటయ్య, దుగ్యాని రాములు తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ కల్చరల్ : వేములవాడ పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్దగల శ్రీఉజ్జయిని మహంకాళి అమ్మవారికి ఆదివారం పట్టణవాసులు ఘనంగా బోనాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. పలువురు భక్తులు పొట్టేళ్లతో ఫలహారాల బండ్లను తీసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పిల్లపాపలను చల్లగా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు.

శిథిలావస్థలో తరగతి గది.. విద్యార్థుల ఇబ్బందులు..



శిథిలావస్థకు చేరిన తరగతి గది

ఇల్లంతకుంట, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా వసతులు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. మండలంలోని సిరికొండ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సరైన తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలో ఐదు గదులు ఉండగా వాటిలో ఒకటి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దానిలో తరగతి కొనసాగడం లేదు. మిగిలిన నాలుగు గదులలో ఒకదానిని కార్యాలయంతో పాటు అందులో ఒక తరగతిని నడిపిస్తున్నారు. ఏడు తరగతులకు కేవలం నాలుగు గదులు మాత్రమే ఉండటం వల్ల విద్యార్థులను కలిపి కూర్చుండబెడుతున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 55మంది విద్యార్థులతో పాటు 10మంది పూర్వప్రాథమిక విద్యార్థులు ఉన్నారు. తల్లిదండ్రుల విజ్ఞాపనల మేరకు సాయంత్రం అదనంగా ఒక గంట పాటు పాఠశాల వరండాలో ప్రత్యేక తరగతిని ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి అదనపు తరగతి గదులను కేటాయించాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ కోరారు.

యాదవ సంఘం కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని శ్రీకృష్ణయాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవయ్యయాదవ్, ఉపాధ్యక్షుడిగా ప్రభుదాస్‌యాదవ్, కార్యదర్శిగా రాజుయాదవ్, కోశాధికారిగా నాగరాజుయాదవ్‌లు ఎన్నికయ్యారు. నారాయణయాదవ్, అంజయ్యయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, మల్లేశంయాదవ్, సత్తయ్యయాదవ్‌లు సలహాదారులుగా వ్యవహరించనున్నారు. సంఘం సభ్యులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి పాటు పడుతామని నూతన కార్యవర్గం పేర్కొంది. అనంతరం కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

- సిరిసిల్ల మసీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సమీ



విద్యార్థికి సర్టిఫికెట్, బహుమతిని అందిస్తున్న అధ్యక్షుడు, నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని సిరిసిల్ల మసీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సమీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని షాదీఖానాలో మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈనెల 25న ఇస్లామిక్ కరికుల అనే పుస్తకంలోని అంశాలపై మైనార్టీ విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించగా ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లతోపాటు బహుమతులను అధ్యక్షుడు సయ్యద్ సమీ, నాయకులు అందించి అభినందించారు. ఇస్లాం పూర్తి పద్ధతులను పాటించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి వేయి రూపాయల నగదును బహుకరించారు. ఈ కార్యకమంలో మసీద్ కమిటీ మాజీ అధ్యక్షులు ఎండీ సలీం, షేక్ యూసుఫ్, నాయకులు సయ్యద్ సాదిక్, సయ్యద్ సమద్, సయ్యద్ అక్రమ్, సయ్యద్ జాంగిరి, సయ్యద్ సోహెల్, మునీర్, ఇంతియాజ్, అంజద్, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చొక్కి సులోచన కుటుంబానికి రాచర్లగొల్లపల్లిలోని అమ్మ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మురళీమోహన్‌గౌడ్ ఆదివారం రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు సుభాష్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌స్వామి, సాయిచరణ్, నర్సింలు, ప్రభు, శివారెడ్డి, ఉమేశ్ పాల్గొన్నారు.

తెలంగాణను అప్పుల్లోకి నెట్టిన బీఆర్ఎస్

గంభీరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. గంభీరావుపేట గాయత్రి ఫంక్షన్ హాల్‌లో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ 18నెలల కిందట ప్రజల కోర్కెలను, ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కో హామీని నెరవేరుస్తున్నారన్నారు. తహసీల్దార్ మారుతిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, నాయకులు రామచంద్రారెడ్డి, రావేందర్‌రెడ్డి, ప్రవీన్, గౌరిశంకర్, ప్రబాకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

అప్పు పుట్టట్లే..

(5వ పేజీ తరువాయి)

బలవన్మరణాలకు పాల్పడ్డ సంఘటనలు ఉన్నాయి. గ్రామాల్లో ఆశించిన దిగుబడులు రాక అప్పులు తీర్చే మార్గం లేక ప్రాణాలు వదిలిన అన్నదాతలు ఉన్నారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా చిట్ ఫండ్ కంపెనీలు, ఫైనాన్స్ దందా కొనసాగుతున్న అధికార యంత్రాంగం చోద్యం చూస్తున్నట్లుగానే ఉందనే విమర్శలు ఉన్నాయి. వడ్డీరాయుళ్ల ఇష్టారాజ్యంగా మారుతున్న పట్టించుకునే వారే లేరనే విమర్శలు ఉన్నాయి. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో వడ్డీ దందా అనేక కుటుంబాలను రోడ్డున పడేసిన సంఘటనలు ఉన్నాయి. ప్రధానంగా సిరిసిల్ల, వేములవాడలో ఫైనాన్స్ వ్యాపారం కూడా జోరుగా సాగుతోంది. సామాన్యుల అవసరాలను అవకాశంగా తీసుకొని వీక్లీ ఫైనాన్స్, డైలీ ఫైనాన్స్ నెలవారీ ఫైనాన్స్‌లు అనధికారికంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు ఇళ్ల మార్టిగేజ్, బంగారం తాకట్టుతో కూడా అప్పులు ఇస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా జిల్లాలో కోట్ల రూపాయల్లో దందాలు జరుగుతున్నాయి. జిల్లాలో కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో సబ్దత నెలకొనడంతోనే రియల్ వ్యాపారులు ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారులుగా మారుతున్నారు. అంతేకాకుండా రియల్ ఎస్టేట్ దందాలో అవసరాన్ని బట్టి అదాయాన్ని సర్దుబాటు చేసే వీలు ఉండడంతో వడ్డీ వ్యాపారాల వైపు కూడా మొగ్గు చూపుతున్నారు. వడ్డీ వ్యాపారులు సాధారణంగా కొందరు రూ 2 నుంచి 3వరకు వసూలు చేస్తుండగా కొంతమంది 5 శాతం వసూలు చేస్తున్న వారు ఉన్నారు.

నామమాత్రంగా కేసులు...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో సామాన్యుల ఆర్థిక అవసరాలను పెట్టుబడిగా దందా చేస్తున్న వారిపై పోలీస్ యంత్రాంగం నామమాత్రంగానే నిఘా పెడుతుందనే విమర్శలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం వడ్డీ వ్యాపారులపై నామమాత్రంగా దాడులు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. 2024 సంవత్సరం జిల్లాలో 54 కేసులు నమోదు చేశారు. 18 కేసుల్లో రూ 17 లక్షల 34 వేల జరిమానాలు పడ్డాయి. ఈ సంవత్సరంలో 12 కేసులు నమోదు చేశారు. ఈ నెలలో 20 బృందలతో జిల్లా వ్యాప్తంగా ఆకస్మికంగా తనిఖీలు చేసి 10 మంది పైన కేసులు నమోదు చేశారు. రూ 60 లక్షల విలువైన వివిధ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. కొంత మంది పోలీసుల దాడులకు భయపడి నామమాత్రంగా చిట్ ఫండ్ కంపెనీల పేరుతో రిజిస్ట్రేషను చేసుకొని ఆ పేరుతో ఫైనాన్స్ దందాలు నడుపుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



హన్మాజీపేట హైలెవెల్ బ్రిడ్జి ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పన రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట నక్కవాగుపై 11.55 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి, కోరుట్ల వేములవాడ ప్రధాన రహదారిపై నిర్మించిన మర్రిపల్లి బ్రిడ్జిలను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ నియోజకవర పరిధిలో గతంలో అనేక సమస్యలపై రాజీలేని పోరాటం చేశామన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక ఆ సమస్యలను పరిష్కారం చేసుకుంటూ ముందుకు పోతున్నామన్నారు. నక్క వాగుపై, మర్రిపల్లిలో బ్రిడ్జి నిర్మాణం వేములవాడ రాజన్న ఆలయ పట్టణ అభివృద్ధిపై, కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ నిర్మాణం కోసం ఇలా గత పది సంవత్సరాలుగా పడావు పడిన పనులను ఇప్పుడు ఒక్కొక్కటిగా పూర్తిచేస్తున్నామని తెలిపారు. గత వర్షాకాలంలో ఇదే వాగు గుండా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి మళ్లీ వర్షాకాలంలోపు బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయాలని సంబంధిత అధికారులతో మాట్లాడి అనాడు ఇచ్చిన మాట ప్రకారం బ్రిడ్జిని ప్రజలకు అంకితం చేశామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించామన్నారు. ఆరోగ్యశ్రీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను కొనసాగిస్తూ అదనంగా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం అమలు చేసే ప్రతిష్ఠాత్మక పథకాల్లో ప్రతీ గ్రామానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, పలువురు నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

మూతపడ్డ ప్రభుత్వ పాఠశాల.. ఇబ్బందుల్లో విద్యార్థులు



మూతపడిన మహ్మద్ హుస్సేన్ పల్లె పాఠశాల

కోనరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సర్కార్ పాఠశాల మూతపడడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండలం మర్రిమడ్ల ఆమ్లెట్ గ్రామమైన మహమ్మద్ హుస్సేన్‌పల్లెలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతపడింది. ఇందులో 15 మంది విద్యార్థులు ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేసే వారు కానీ ఈ సంవత్సరం ప్రభుత్వం ఈ పాఠశాలను మూసివేయడంతో అహ్మద్ హుస్సేన్ పల్లె నుంచి మరిమడ్ల ప్రభుత్వ పాఠశాలకు సుమారు కిలోమీటర్ విద్యార్థులు నడిచి వెళుతున్నారు. అహ్మద్ హుస్సేన్ పల్లె గ్రామ ప్రజలు ఎలాగైనా పాఠశాలను తెరిపించి విద్యార్థులకు అందుబాటులో ఉండే ఈ పాఠశాలను ప్రారంభించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు.

పల్లెలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం : బీఆర్ఎస్



మురుగు కాల్వలో బ్లీచింగ్ చల్లుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు హరితహారం, స్వచ్ఛత కార్యక్రమాలను ఆదివారం చేపట్టారు. హరితహారంలో భాగంగా మొక్కలను నాటారు. మురుగు నీటి కాల్వల్లో బ్లీచింగ్‌ను చల్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు గ్రామాల అభివృద్ధిని విస్మరిస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ హయంలో హరిత హారం పథకంలో భాగంగా పల్లెల్లో మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టి పచ్చదనం పంచేందుకు కృషి చేసిందని అన్నారు. పారిశుద్ధ్య పనులను ప్రణాళికతో చేసి స్వచ్ఛ పల్లెలుగా తీర్చిదిద్దిందని అన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయకపోవడం వల్ల చెత్తాచెదారం పేరుకుపోయి వ్యాధులు ప్రబలుతున్నాయని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో చేపట్టిన పథకాలను గుర్తు చేసేందుకు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టామని కృష్ణహరి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, తాజా, మాజీ ఎంపీపీ రేణుక, నాయకులు సుభాష్, శ్రీనివాస్, శివారెడ్డి, శ్రీకాంత్, మురళీమోహన్‌గౌడ్, కిషన్, స్వామి, వెంకట్‌రెడ్డి, చంద్రారెడ్డి, బాల్‌రెడ్డి, ప్రభునాయక్, నర్సింలు, సీత్యానాయక్, వెంకట్‌రెడ్డి, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం పిల్లర్ కూల్చివేయడం విచారకరం

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



పిల్లర్ కూల్చివేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట, జులై 20 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేటలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ నిర్మాణ పిల్లర్‌ను కూల్చి వేయడం విచారకరమని సిరిసిల్ల నియో జకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ కేకే మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో పిల్ల ర్‌ను కూల్చివేసిన స్థలాన్ని విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులతో కలిసి ఆదివారం కేకే మహేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కొందరు గిట్టని వారు విగ్రహం నిర్మాణ పనులపై ఫిర్యాదులు చేయడం వల్లే ఈ ఘటనకు దారి తీసిందన్నారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం గద్దెకు అవసరమయ్యే సిమెంటు, సలాక అందజేస్తానని చెప్పారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు. జిల్లాకాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నర్సయ్య. పాపగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియా శాసిస్తోంది

సిరిసిల్లరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల నియోజకవర్గంతో పాటు పట్టణాన్ని ఇసుక మాఫియా శాసిస్తోందని భారతీయ జనతాపార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని 35వ వార్డు సుందరయ్యనగర్‌లో అదివారం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జెండాను పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ ఆవిష్కరించారు. అనంతరం పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలను కప్పి చేర్చుకున్నారు. ఈసందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కార్మిక క్షేత్రమైన సుందరయ్యనగర్‌లో బీజేపీ ప్రస్థానం మొదలైందన్నారు. జరుగబోయే మున్సిపాల్టీ ఎన్నికలల్లో బీజేపీ అభ్యర్థులను గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయలన్నారు. సిరిసిల్ల మున్సిపాల్టీని గత పదేళ్లు బీఆర్ఎస్ పాలన పేరుతో ప్రజలకు అన్యాయం చేసిందన్నారు.ఇసుక మాఫియా సిరిసిల్లను శాసిస్తుందని ట్రాక్టర్‌ఇసుక ధరలను రూ2వేల నుంచి రూ 6వేలకు పెంచి అక్రమంగా నిరుపేదలను దోచుకుంటున్నారని ఆరోపించారు. కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు నాగుల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ గుడూరి భాస్కర్, నాయకులు తదితరులు ఉన్నారు.

30 మంది నిరుద్యోగ విద్యార్థుల ఎంపిక

సిరిసిల్ల టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం నేతాజీ డిగ్రీ కళాశాలలో జరిగిన క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్(జాబ్‌మేళా)లో 30 మంది నిరుద్యోగ విద్యార్థులు ఎంపికైన్నారు. ఆదివారం ఎంపికైన 30 మంది నిరుద్యోగ విద్యార్థులకు కళాశాల చైర్మన్ జూపల్లి పృధ్వీధర్‌రావు, కంపనీల నుంచి ఆఫర్ లెటర్ల (నియామక పత్రాలు)ను అందించి అభినందించారు. శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు నేతాజీ డిగ్రీ కళాశాలలో గాట్నిక్, ఐడీఎక్స్, లలాటక్ష కంపనీలు డిజటల్ మార్కెటింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, హ్యూమన్ రిసోర్స్, ఫుల్ స్టాక్ డెవలపర్, యూఎస్ ఐటీ రిక్రూట్మెంట్, రెస్యూమ్ అనలైజర్‌లలో ఉద్యోగ అశాకాశాలను కల్పిస్తూ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 2022-25 విద్యా సంవత్సరకాలంలో బీటెక్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ పూర్తిచేసిన నిరుద్యోగ విద్యార్థులకు కళాశాలలో హెల్ప్‌డెస్క్ ద్వారా క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో భాగంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 183మంది విద్యార్థులు హాజరుకాగా 30 మంది చివరి రౌండ్‌కు చేరుకొని ఎంపికయారు. ఎంపికైన 30మంది విద్యార్థులకు కళాశాల చైర్మన్ జూపల్లి పృధ్వీధర్‌రావు, కంపెనీల బాధ్యులు ఆఫర్ లెటర్లను అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ పృధ్వీధర్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ..

వేములవాడ టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలపై వ్యవసాయాధికారులు ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణాల్లో డీలర్ల వద్ద స్టాక్ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. ఎరువుల దుకాణాల్లో నిర్వహించే వ్యాపార లావాదేవీలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. రైతులకు ఎరువుల కృత్రిమ కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని డీలర్లను ఆదేశించారు. సరఫరాలో పారదర్శకత పాటించాలని, అవసరమైతే ఎరువులు రైతులకు సకాలంలో అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయాధికారి సాయికిరణ్, విస్తరణ అధికారి రాజు తదితరులు ఉన్నారు.

గతుకుల రోడ్డు.. వాహనాలకు తప్పని ఇబ్బందులు



పైకి లేచిన ఆటో ముందు భాగం

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గతుకుల రోడ్డుపై వెళుతున్న ఓ ట్రాలీ ఆటో ఆదివారం ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని హఠాత్తుగా పైకి లేచింది. అప్రమత్తమైన డ్రైవర్ వాహనాన్ని నిలిపివేయడంతో ప్రమాదం తప్పినట్లయింది. ట్రాలీ ఆటోలో కర్రలను లోడు చేసుకుని ఎల్లారెడ్డిపేట నుంచి రాచర్ల గొల్లపల్లి వైపు వెళుతోంది. ఎదురుగా ఉన్న సీసీ రహదారి కోతకు గురవడంతో ఒక్కసారిగా ట్రాలీ ఆటో ముందు భాగం పైకి లేచింది. అటువైపుగా వెళుతున్న ఆటోడ్రైవర్లు చేరుకుని కిందకు దింపేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ట్రాలీలోని కర్రలు కింద పడేయడంతో ఆటో ముందుకు వెళ్లింది. అనంతరం కూలీలతో కర్రలను ట్రాలీలో లోడు చేయించుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కోతకు గురై ప్రమాదకరంగా మారిన సీసీ రోడ్డు వద్ద మరమ్మతుచేయాలని ఆటోడ్రైవర్లు, వాహనదారులు కోరుతున్నారు.

బీఆర్ఎస్ నాయకులు వ్యక్తి పూజ మానుకోవాలి..

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిపూజ మానుకోవాలని కాంగ్రెస్ నాయకుడు ఎడ్ల రాజ్‌కుమార్ సూచించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హయంలో కాంట్రాక్టులు, కమీషన్లు దండుకుని ఆ నలుగురే బాగుపడ్డారని మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారని అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసిన దళిత నాయకులకు అభివృద్ధి పనులు ఎందుకు అప్పగించలేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ కోసం కష్టించిన నాయకులు, కార్యకర్తలను వాడుకుని ప్రస్తుతం వారిని పట్టించుకోకపోవడం వల్ల ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. రాజకీయం అంటే సినిమా కాదని, ప్రజలకు సేవ చేసే గుణం ఉండాలన్నారు. గత బీఆర్ఎస్ హయంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ పార్టీ నాయకుల నాలుకలు కోస్తామంటూ ఆ పార్టీ నాయకులు హెచ్చరించడం తగదనిన్నారు. అక్రమాలపై ప్రజల ముందు చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు లక్మారెడ్డి, గౌస్, కిషన్, బాల్‌రెడ్డి, రామచంద్రం పాల్గొన్నారు.

ఘనంగా ముక్కోటి కుంకుమార్చనలు ప్రారంభం



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సిరిసిల్ల టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ముక్కోటి కుంకుమార్చనలతో సిరిసిల్ల ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆదివారం జిల్లా కేంద్రం సాయినగర్‌లోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలోని రాజాశ్యామల, వారహి సహిత, లలిత త్రిపురసుందరి, అష్టలక్ష్మి సహిత, లక్ష్మీనారాయణ దేవాలయాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముక్కోటి కుంకుమార్చనలు ప్రారంభించారు. పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో ముక్కోటి కుంకుమార్చనలతో అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయంలో శ్రీలలిత త్రిపుర సుందరి అమ్మవారు శాఖంభరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముక్కోటి కుంకుమార్చనలు ఈనెల 29 వరకు జరుగనున్నాయి.